# మత్తు వ్యాపారం

**డాట్సన్ కారు మెయిన్ రోడ్ మీద పరుగెత్తుతోంది. చల్లటి గాలి రివ్వుమంటూ కారులోకి దూసుకు వస్తూ గిలిగింతలు పెడ్తోంది. డిటెక్టివ్ శిరీష్ రిలీఫ్‌గా మంద హాసం చేశాడు.**

ఒక గంట క్రితం రాబర్ట్ తన వద్దకు వచ్చాడు. అతడు తన సహాయం కోరి వచ్చాడు. పోలీసులు వల వేసి పట్టుకోవాలనుకునే ఘరానా మనుషులలో రాబర్ట్‌ను మొదట చెప్పుకోవాలి. అతడికి మాఫియా ముఠాతో గొప్ప సంబంధా లున్నాయి. భారత దేశంలోని ప్రతి నగరంలోనూ పట్టణంలోనూ అతడి చీకటి మనుషులు చెలరేగి పోయి కోట్ల రూపాయల నల్ల వ్యాపారం చేస్తు న్నారు.

భారత దేశపు ఆర్థిక వ్యవస్థకు రాబర్ట్ లాంటి రాక్షసుడు నిజంగానే వేరుపురుగు! యువతరం బరువూ బాధ్యతా తన భుజస్కందాలమీద వేసుకున్నట్టు వారికి మత్తు మందుల బానిసత్వం మప్పాడు.

మరొకప్పుడైతే అటువంటి కేడీని ముక్కలు విరగబొడిచి చట్టం చేతులకు వాడిని ఒప్పచెప్పి వుండేవాడు డిటెక్టివ్ శిరీష్.

కాని రాబర్ట్ అతడి వద్దకు వచ్చిన పరిస్థితి వేరు.

శత్రువులతో పోరాటంలో దెబ్బలు తిని గత్యంతరం లేని పరిస్థితుల్లో డిటెక్టివ్ శిరీష్ యింటికి పరుగెత్తుకు వచ్చాడు.

తమ యింటి తలుపు తట్టగానే డిటెక్టివ్ శిరీష్‌కి అర్థమయింది.

అవతల వ్యక్తి ఆపదలో వున్నాడు. గాభరాలో తలుపు తట్టాడు. లేకపోతే కాలింగ్ బజర్ మోగించేవాడు. చటుక్కున తలుపు తెరిచి అతడిని లోపలికి లాగి తలుపు వేశాడు డిటెక్టివ్ శిరీష్.

అతడి గడ్డం చిట్లిపోయింది. భుజాల మీదా కడుపు మీదా చెయిన్స్‌తో గాయాలయినట్టు రక్తం ఓడుతున్నాయి. పాంటు మీద రక్తం మరక లంటాయి. మట్టిలోంచి రాళ్ళలోంచి పరుగెత్తుకు వచ్చినట్టు కాళ్ళకు జోళ్ళు లేవు... పాదాలు బూడిద కొట్టుకుపోయి వున్నాయి.

"ఎవరు మీరు..." అడిగాడు డిటెక్టివ్ శిరీష్ తలుపుకి బోల్ట్ పెట్టి.

"రాబర్ట్" వగర్చాడతడు.

డిటెక్టివ్ శిరీష్ నుదురు చిట్లించాడు. ఒకసారి పరీక్షగా మొహంలోకి చూశాడు. సులువుగానే గుర్తుపట్టేశాడు. అతడి ఫోటో భారత దేశంలో అన్ని పోలీస్ స్టేషన్లలోనూ ప్రముఖంగా ప్రదర్శనకు పెట్టారు.

"నీ తల విలువ అయిదు లక్షలు! అవునా?" నవ్వాడు శిరీష్.

రాబర్ట్ సగర్వంగా తల ఊపాడు.

"ఏం జరిగిందో వివరంగా చెప్పు?" అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

ఇద్దరూ ఎదురెదురు కుర్చీల్లో కూర్చున్నారు.


రాబర్ట్ గొంతు సవరించుకున్నాడు. "...దో పెద్ద ముఠా! మీరంతా పెద్దమనుషులుగా గుర్తించే వాళ్ళు మా సంఘంలో ప్రముఖ సభ్యులు! నేనిప్పుడు ఆ ముఠాలోంచి విడిపోవాలనుకుంటున్నాను. ఎల్.ఎస్.డి. పంపకాల్లో మాకు తగాదాలు వచ్చాయి" అన్నాడు.

డిటెక్టివ్ శిరీష్ మందహాసం చేశాడు.

"మీరు నవ్వుతున్నారు, ఎందుకో తెలుసుకోవచ్చునా" అడిగాడు రాబర్ట్.

"ఎల్.ఎస్.డి. పంపకంలో ఒక్కటేనా తగాదా! మీలో మీకు ప్రతి క్షణం తగాదా రావలసిన క్షణాలే-అందుకే నవ్వు వచ్చింది!"

రాబర్ట్ ఒక్క క్షణం సందేహంగా చూసి "మీ రన్నది నిజమే సార్! కోట్లాది రూపాయల ట్రాన్సాక్షన్ కావడంతో అది తప్పనిసరనుకోండి! ఎప్పుడు ఎవడు ఏ రకంగా వెన్నుపోటు పొడుస్తాడో తెలియని పరిస్థితి! అసూయా ద్వేషాలు పెరిగి



◆ ఎం.వి.వి. సత్యనారాయణ

పోయాయి. ఉజ్జయినిలో నా భవనం మీదే నా మనుషులు దాడి చేశారు. పారిపోవలసి వచ్చింది. పట్నం వెలుపల నా విమానం వుంది. దాంట్లో పారిపోయాను. ఎక్కడికి వెళ్ళగలను? అన్ని విమానాశ్రయాలూ నావి కాదు కదా! విశాఖ పట్నంలో ఊరి బయట స్టీల్ ప్లాంట్ రోడ్ల మీద విమానాన్ని దింపాను. కొద్దిపాటి లగేజీతో బయట పడ్డాను." అన్నాడు.

డిటెక్టివ్ శిరీష్ మందహాసం చేశాడు.

"నా అదృష్టం సార్! సెక్యూరిటీ గార్డ్స్ వేరే పని మీద బిజీగా వున్నారు! లేకపోతే నేను మెయిన్ గేట్లోంచి బయట పడలేను."

"వేరే పని! అంటే?"

"ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. వాళ్ళు అటు వెళ్ళారు. ఒకే ఒక్క గార్డ్ మాత్రమే వున్నాడు. అతడ్ని తప్పించుకోవడం



నాకేమ్మాత్రం కష్టం కాలేదు.

"ఊ! తర్వాత..."

"రోడ్డున పోయే ఖాళీ డంపర్‌ను పట్టుకుని గోపాలపట్నం రోడ్డు వరకూ వచ్చేశాను. అక్కడ నా కోసం రెండు కార్లు కాచుకున్నాయని ఆలస్యంగా తెలుసుకున్నాను. డంపర్ దిగంగానే కార్లు నన్ను ఫాలో అయాయి. నేను పరుగు తీశాను. టాక్సీ ఒకటి కనిపిస్తే ఆపి ఎక్కి కూర్చున్నాను. టాక్సీ కదలగానే కార్లు కూడా వెంట బడ్డాయి. నిర్జన ప్రదేశంలోకి టాక్సీ రాగానే ఆ వాహనం మీద తుపాకులు మోగాయి. టాక్సీ మారుమోగిపోతోంది. టాక్సీ డ్రయివర్ టాక్సీ ఆపి నన్ను బలవంతంగా బయటికి దింపి వెళ్ళిపోయాడు. వాళ్ళు నా మీద చెయిన్స్‌తో దాడి చేశారు. పారి పోయాను. ఎంతకని పరుగెత్త గలను? పడ్తూ లేస్తూ సందు గొందుల్లో పడి దెబ్బలు తింటూ యిటు పరు గెత్తుకు వచ్చాను" ఆగాడు రాబర్ట్.

"మా రోడ్లో కూడా వాళ్ళు నిన్ను తరి మారా?"

"పక్క రోడ్లో తరిమారు! మీ రోడ్లోకి అడ్డంపడి వచ్చాను. బహుశా ఏ యింట్లోకి వెళ్ళానో తెలుసుకోడానికి వాళ్ళకు సమయం పట్టుంది!" అతడు వాష్ బేసిన్ కోసం వెతు క్కుంటున్నాడు.

రాబర్ట్‌కి నీళ్ళ గది చూపించాడు డిటెక్టివ్ శిరీష్.

గాయాలకు కట్టు కట్టాక డిటెక్టివ్ శిరీష్ అతడికి కాఫీ యిచ్చి సేద దీరే వరకు వెయిట్ చేశాడు.

"నా వల్ల ఏం సహాయం కావాలి? నిజం చెప్పాలంటే నా వల్ల నీకు జరిగే సహాయమల్లా కారాగార వాసం! కోర్టులో ముద్దాయిగా నిల బెట్టడం!"

రాబర్ట్ నీరసంగా నవ్వి "మీరామాట అంటారని ఊహించాను. నన్ను ఒక్కడ్ని పట్టు కోవడం వల్ల మీకు ప్రయోజనం తక్కువ! నా అంగట్లో సైనైడ్ కాప్సూల్ వుంచుకున్నాను అందువల్ల మీరు నా మాట వినక తప్పదు" అన్నాడు.

డిటెక్టివ్‌కి ఇక అతడి మాట వినక తప్పలేదు. రెండు రోజుల తర్వాత ఆ ఫలితంగానే ఉద యాన్నే చల్లటి గాలిలో కారు ప్రయాణం.

సోహన్‌లాల్ జువెలర్స్ షాప్‌కి కొద్ది దూరంలో డాట్సన్ కారాపాడు డిటెక్టివ్ శిరీష్. షాప్‌లోకి చూశాడు. షాప్‌లో అట్టే జనం లేరు. ఒక నడి వయస్కుడు మాత్రమే కౌంటర్ వద్ద నిలబడి బంగారు వస్తువు నాణ్యతను పరీక్షించు కుంటున్నాడు.

మరో వ్యక్తి షాప్ యివతల అరుగు మీద నిలబడి సిగరెట్ కాల్చుకుంటున్నాడు. ఖరీదైన సూట్ ధరించాడతడు. చేతిలో చిన్న బ్రీఫ్‌కేసు వుంది. ఆగి ఆగి ఒక్కోసారి బ్రీఫ్ కేసు వైపు, రోడ్డు వైపు చూపులు మార్చుతూ వున్నాడతడు.

ఎర్రగా బొద్దుగా వున్న అతడు ఒకసారి శిరీష్ కళ్ళలోకి చూశాడు. డిటెక్టివ్ శిరీష్ చటుక్కున పిస్తోలు తీసి అతడి వైపు గురి పెట్టాడు. బ్రీఫ్ కేస్ వ్యక్తి మొహం వాడిపోయింది. చావు తెలివి అతడిలో ప్రవేశించినట్టుంది, బ్రీఫ్ కేసును గుండెలకు అడ్డంగా వుంచుకున్నాడు. కెవ్వున కేక పెట్టాడు. అయినా పిస్తోలు కర్కశంగా గర్జించడం ఆగలేదు. మూడు బులెట్స్ అతడిని తీవ్రంగా గాయపరిచాయి.

బ్రీఫ్ కేసు వ్యక్తి వెనక్కి తుళ్ళిపడిపోయాడు.

అతడి చేతిలోంచి సిగరెట్ ఎగిరి మురి క్కాలవలో పడిపోయింది.

బ్రీఫ్ కేసు వ్యక్తి గిల గిల కొట్టుకుని చివరి శ్వాస విడిచి పెట్టినట్టు కొట్టుకోవడం ఆపేశాడు. డిటెక్టివ్ శిరీష్ పరుగెత్తుకు వెళ్ళి తన కారులో కూర్చున్నాడు. సైలెన్సర్ అమర్చిన పిస్తోలు కావ డంతో జనాన్ని దృశ్యం మాత్రమే ఆకర్షించింది. హతుడి చుట్టూ జనం జమపడే టప్పటికి డాట్సన్ కారు అక్కడ లేదు.

చల్లటి చిరుగాలికి సైతం డిటెక్టివ్ శిరీష్ చెమటలు కక్కుతున్నాడు.

అంతా అనుకున్నట్టవుతుందా?

రాబర్ట్ మాట నిలబెట్టుకుంటాడా?

## 2

మార్చ్యురీ గది లోంచి శబ్దాలు వస్తున్నాయి. అటెండర్‌కి లోపలికి వెళ్ళడానికి ధైర్యం చాలడం లేదు. మార్చ్యురీ గదిలో మూడు బులెట్స్‌తో మరణించిన వాడి శవాన్ని వుంచి గంట అవు తోంది. ఈ గంట వ్యవధిలోనూ ఎవరూ గదిలోకి వెళ్ళలేదు. కాని గదిలోంచి శబ్దాలు వస్తున్నాయి.

శవం ఉంచిన గదిలోంచి శబ్దాలు ఎలా వస్తాయి?

కిటికీలోంచి ధైర్యం తెచ్చుకుని లోప లికి చూశాడు అటెండర్.

బల్ల మీద వుంచిన శవం బల్ల మీద లేదు. గదంతా చూడాలని ప్రయత్నించాడు అటెండర్. కిటికీ రెక్క అడ్డు వచ్చింది.

అయినా శవం ఏమయింది? లోపలికి వెళ్ళి

మాస్తేనో!

అటెండర్‌కి ధైర్యం చాలలేదు.

గదిలో మరల శబ్దం వచ్చింది. బల్ల మీద టకటక వేళ్ళతో సంగీతం వాయించినట్టు శబ్దం వచ్చి ఆగిపోయింది.

అటెండర్‌కి తన గుండె ఆగిపోయినట్టనిపించింది.

గుమ్మంలో యిక నిలబడలేక పోయాడు. పిక్క సత్తువకొద్దీ పారిపోయాడు. అతడి దారికడ్డంగా డాట్సన్ కారు రావడం కూడా అతడికి తెలియదు. భయ సందేహాల మధ్య అతడు కంగారు పడిపోయాడు.. కాబట్టే డాట్సన్ కారు మార్చ్యురీకి దగ్గరలో ఆగడం అతడికి తెలియదు.

మార్చ్యురీలోంచి ఒక వ్యక్తి పరుగెత్తుకుంటూ వచ్చాడు. కారు తలుపు తెరుచుకుని డిటెక్టివ్ శిరీష్ పక్కనే కూర్చున్నాడు.

కారు బయల్దేరింది.

"ఎలా వుంది రాబర్ట్ నీ పునర్జన్మ అనుభవం!' అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

"బ్రహ్మాండంగా వుంది సర్! బ్రీఫ్ కేస్‌తో అడ్డుకోక పోతే నకిలీ బులెట్స్ కనీసం ఒంటికైనా తగిలేవి. అసలు పేలే బులెట్స్ శరీరంలో ఫిక్స్ చేసుకున్నట్టూ అవే రక్తం కనిపించడానికి కారణమైనట్టూ జనానికి తెలియలేదు. అంతవరకూ నయం!"

"రాబర్ట్! నీ శత్రువుల దృష్టిలో నువు చచ్చిపోయినట్టే! ఇప్పుడు నువు వాళ్ళ ఆచూకీ సులువుగా యివ్వగలవు" కారు యింటి ఆవరణలోకి మలుపు తిప్పాడు డిటెక్టివ్ శిరీష్.

రాబర్ట్ మందహాసం చేశాడు.

3

టెలిఫోన్ బూత్‌కి కొద్ది దూరంలో కారాపాడతడు. కారు దిగి బూత్‌లో ప్రవేశించాడు. రిసీవరెత్తి డయల్ టోన్ విన్నాడు. సాకెట్‌లో నాణెం వేసి నంబర్ డయల్ చేశాడు.

అవతల పక్క నుండి ఎంగేజ్డ్ సౌండ్ వస్తోంది.

వెయిట్ చేశాడతడు.

దారిన పోయే వాహనాలను గాజు అద్దాల్లోంచి చూస్తున్నాడు.

"హలో..." అవతలి గొంతు పలికింది.

"ఎస్... వెన్నెల వేడిగా వుంది."

"నువ్వా రాబర్ట్! చెప్పు!..."

"మీరు బయల్దేరుతున్నారా సర్!"

"ఎస్..."

"త్రీలాంప్స్ దగ్గర కిషోర్ ఎలక్ట్రానిక్స్."

"ఎస్. పది నిముషాల్లో వుంటాను."

"మీ కారులో వస్తారా సర్!"

అవతల క్లిక్ మంది.

రాబర్ట్ రిసీవర్‌లోకి ఒకసారి చూచి మందహాసం చేసి రిసీవర్‌ను విసరికొట్టి బూత్‌లోంచి బయటికి పరుగెత్తాడు. కారులో కూర్చున్నాడు. స్టార్ట్ చేసి ఒకసారి వెనక్కి చూశాడు. డాట్సన్ కారు రోడ్డు మీద ప్రత్యక్ష మయింది. చుట్టూ డార్క్ కూలింగ్ గ్లాస్ వుండటం వల్ల డ్రయివింగ్ సీట్లో ఎవరున్నదీ తెలియడం లేదు.

తన కారును డాట్సన్ కారు దాటే వరకూ వేచి వున్నాడు రాబర్ట్.

తరువాత డాట్సన్‌ని వెంబడించడం ప్రారంభించాడు.

త్రీలాంప్స్ వద్ద ఒక రౌండ్ కొట్టి కిషోర్ ఎలక్ట్రానిక్స్ షాప్ ముందాగింది డాట్సన్. రాబర్ట్ కొంత దూరంలో కారు ఆపి డాట్సన్ వైపు నడిచాడు. డిటెక్టివ్ శిరీష్ డాట్సన్ కారు దిగి షాప్‌లోకి నడిచాడు.

"మే ఐ హెల్ప్ యూ సర్" అడిగింది ఆంగ్లో యిండియన్ యువతి.

"వెన్నెల వేడిగా వుంది!"

ఆమె కనురెప్పలల్లాడించింది. బెల్ నొక్కి కుర్రవాడిని పిలిచింది. లోపలికి తీసుకు వెళ్ళమన్నట్టు సైగ చేసింది.

షాప్ వెనుక పెద్ద హాలు వుంది.

హాలులో భారీ కాయుడొకడు అకౌంట్స్ రాసుకుంటూ కనిపించాడు. డిటెక్టివ్ శిరీష్‌ను చూడగానే రమ్మని ఆహ్వానించాడు. తన గురించి అప్పటికే ఆంగ్లో యిండియన్ యువతి అతడికి యింటర్ కమ్‌లో చెప్పి వుండాలి.

డిటెక్టివ్ శిరీష్ తల పంకించి అతడికి ఎదుటి కుర్చీలో కూర్చున్నాడు.

"ఇండెంట్ తీసుకు వచ్చారా?" అడిగాడు భారీకాయుడు.

"మాకు లిస్ట్ అందలేదు" అన్నాడు డిటెక్టివ్ శిరీష్.

భారీకాయుడు నుదురు చిట్లించి, "మీరెవరు?" అన్నాడు.

అప్పటికే అతడి కణతకు పిస్తోలు గొట్టం అంటుకుంది. ట్రిగ్గర్ మీద శిరీష్ వేలు బిగించాడు. పిస్తోలును ఆ స్థితిలో వుంచే సేఫ్టీ కాచ్ తప్పించాడు డిటెక్టివ్ శిరీష్.

భారీకాయుడు అంతసేపూ గుటక వేయడం కూడా మరచిపోయాడు.

అతడి కుర్చీని బలంగా తన్ని శిరీష్ అతడిని కిందికి పడగొట్టి చేతులకు బేడీలు వేశాడు. అతడిని లేవదీసి నిలబెట్టాడు.

భారీకాయుడు మోకాలు మడిచి డిటెక్టివ్ శిరీష్‌ను డొక్కలో కుమ్మాడు. డిటెక్టివ్ శిరీష్ ముందే ఊహించి నట్టున్నాడు, అతడి మోకాలిని దొరక బుచ్చుకుని మెలితిప్పి మొహం మీద ఈడ్చిపెట్టి తన్నాడు.

"హరిజనోద్ధారక అంబేద్కర్"

భారత రాజ్యాంగ నిర్మాత, హరిజనోద్ధారకుడు డాక్టర్ అంబేద్కర్‌ను కాంగ్రెస్ కార్యకర్త ఒకరు అడిగారు "హరిజనోద్ధరణ కోసం మేం ఎంతో శ్రమిస్తున్నాం. వాళ్ళకోసం ఎన్నో వసతులు, రాయితీలు కల్పించాం. వాళ్ళ జీవన పరిస్థితిని మెరుగు పర్చడానికి ఎన్నో కార్యక్రమాలుచేపట్టాం. అయినా మా సభలకి వాళ్ళ నుంచి సరైన ప్రతి స్పందన లేదు. అదే మీరు పాల్గొన్న సభలకైతే వాళ్ళు విరగబడి వచ్చేస్తారు. ఏమిటి రహస్యం?" అని

అందుకు ఆయన సమాధానం "దాంట్లో రహస్యమేం లేదు. మీదీ, వాళ్ళదీ సవతి తల్లి — కొడుకుల సంబంధమైతే, నాకూ వాళ్ళకూ మధ్య సంబంధం తల్లి కొడుకుల మధ్య వుండే సంబంధం లాంటిది!"

సేకరణ: శ్రీధర శ్రీరామకృష్ణ

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

భారీ కాయుడు ఒక్క మూలుగు మూలిగి నేలకూలి పోయాడు.

హాలు మొత్తం వెతికి మాదక ద్రవ్యాల ప్యాకెట్లు పరిశీలించాడు శిరీష్.

తిరిగి షాపులోకి వచ్చాడు. రాబర్ట్ కనిపించాడు. పూర్తి మారువేషంలో వున్నాడు రాబర్ట్. ఆంగ్లో యిండియన్ యువతిని, కుర్రవాడినీ, ఇద్దరు సేల్స్ మన్లనూ అదుపులోకి తీసుకుని వున్నాడు.

డిటెక్టివ్ శిరీష్ రిసీవరందుకుని పోలీసులకు ఫోన్ చేశాడు.

4

పత్రికలలో సంచలన వార్తలు ప్రకటింపబడ్డాయి. ప్రతి రోజూ ఎక్కడో మూల మాదక ద్రవ్యాల పట్టివేత జరుగుతోంది. దాదాపు పదహారు మంది బడా స్మగ్లర్లు చట్టం చేతుల్లో నిలబడిపోయారు.

డిటెక్టివ్ శిరీష్‌ను అభినందించబోయాడు ఎస్.పి.

డిటెక్టివ్ శిరీష్ మందహాసం చేసి సున్నితంగా ఆయన నుండి తప్పించుకుని యింటికి వచ్చాడు. ఇంట్లో రాబర్ట్ వున్నాడు. వచ్చింది డిటెక్టివ్ శిరీషేనని స్పష్టంగా నిశ్చయించుకుని మరీ తలుపు తెరిచాడు.

"మనం హైదరాబాద్ వెళ్ళాలనుకున్నాం!" గుర్తు చేశాడు శిరీష్.

రాబర్ట్ తల వూపాడు.

ఇద్దరూ చకచక తయారవ్వడం మొదలు పెట్టారు.

డిటెక్టివ్ శిరీష్ తన గదిలోకి వెళ్ళబోయి ఆగాడు. రాబర్ట్ గుమ్మంలో నిలబడ్డాడు. అతడి చేతిలో పిస్తోలు వుంది. అతడి మొహాన వ్యంగ్య పూరితమైన నవ్వు వుంది.

డిటెక్టివ్ శిరీష్ నుదురు చిట్లించలేదు. పెదిమలు బిగించలేదు.

"రాబర్ట్! ఇంకా నీ బుద్ధి మారలేదు. నువు మారినట్టు భ్రమ పడి నువు ఆడమన్న నాటకమల్లా ఆడాను. పోలీసు వర్గాన్ని మంచి చేసుకున్నాను. మాదక ద్రవ్యాలపట్టివేతకు సంబంధించి నువు గొప్పగా ఉపకరించావనుకున్నాను కాని..."

"మిస్టర్ శిరీష్! తరువాత సంగతి నేను చెబుతాను. జాగ్రత్తగా విను. వీళ్ళందరినీ ఊరికేనే పట్టించ లేదు. ఉజ్జయినిలో నా వ్యాపారానికి ఆటంకం వచ్చింది. ఈ పదహారు మందే కేవలం కక్షగట్టి నా వృత్తికి అడ్డు కట్టగా నిలబడ్డారు. కాబట్టే నా శత్రువులను మీచేత పట్టించాను. అంతేకాని ప్రజా సేవ దృష్టితో మాత్రం కాదు."

"ఇప్పుడు నీ వ్యాపారం బాగుపడ్తుందని నమ్మకం వుందా?"

"నిరభ్యంతరంగా! నా పోటీదారులు తప్పుకున్నారు గదా!"

"ఆల్ రైట్! ఇప్పుడు నన్నేం చేయదల్చుకున్నావు?"

"ఏం లేదు మిస్టర్ శిరీష్! తల వెనుక చిన్న మెదడు మీద సింపుల్ ట్రీట్‌మెంట్...పిస్తోలు బట్‌తో చేస్తాను. ఒక గంట వరకు స్పృహ రాదు. దట్సాల్!"

డిటెక్టివ్ శిరీష్ నవ్వి ఊరుకున్నాడు.

"వెనక్కి తిరగండి మిస్టర్ శిరీష్! కారు తాళం చెవులు యిటివ్వండి...గుడ్...బుద్ధిమంతుడిలాగా నడుచుకుంటున్నారు. వెరీ గుడ్...అలాగే ఈ దెబ్బ కూడా ఒక్కటి తినండి. అఫ్ కోర్స్...ఒక్కోసారి ప్రాణం పోవచ్చు కూడా...అంత వరకూ తెచ్చుకోరనుకుంటా."

డిటెక్టివ్ శిరీష్ నవ్వుతూనే మెట్టామాశాడు.

లాభం లేదు. దెబ్బ తినవలసిందే!

డిటెక్టివ్ శిరీష్‌కి నెత్తిమీద పిడుగు పడినట్టయింది.

రాబర్ట్ కారు తాళం చెవులూపుకుంటూ బ్రీఫ్ కేస్‌తో బయట పడ్డాడు. దాట్సన్ కారు డ్రయివింగ్ సీట్లో కూర్చున్నాడు. ఇగ్నీషన్ కీ తిప్పి కారు స్టార్ట్ చేశాడు. స్టీరింగ్ వీల్ మీద రెండు చేతులూ వేశాడు. అతడి చేతులు కదలలేదు. బలమైన తోలు పటకాలు అతడి మణికట్లను పట్టేశాయి.

చేతులు కదపడానికి లేదు.

కారు కదుల్తోంది.

మొక్కల మధ్యకు దూసుకుపోయి మెత్తటి మన్నులో చక్రాలు కూరుకు పోయాయి. కారు ఆగిపోయింది.

రాబర్ట్ విడిపించుకోలేక నిస్త్రాణగా కూర్చుండిపోయాడు.

తల బొప్పి తడుముకుంటూ డిటెక్టివ్ శిరీష్ కారు దగ్గరకు వచ్చి, "నాకు తెలుసు మిస్టర్ రాబర్ట్!" అన్నాడు శిరీష్.

* * *

పాఠకులూ!

ఇదీ కథ

రాబర్ట్ మీద డిటెక్టివ్ శిరీష్‌కి అనుమానం ఎప్పుడు వచ్చింది? అనుమానించ దగిన సంఘటనలేవి?

* * *

రాబర్ట్‌పట్ల డిటెక్టివ్ శిరీష్‌కు నమ్మకం లేకపోవ దానికి కారణాలు:


1. స్టీల్‌ప్లాంట్ రోడ్ల మీద రాబర్ట్ దిగిన విమానం క్షేమంగా లాండ్ కాదు. భారీ కర్మాగారాల రోడ్లకు యిరుప్రక్కలా హైటెన్షన్ విద్యుత్ స్తంభాలుంటాయి.

2. సెక్యూరిటీ గార్డ్స్ అంత సులువుగా వదలరు.

3. గాయాలతో బయటపడిన రాబర్ట్ అంగుట్లో వున్న విషపు గుళికతో శిరీష్ యింట్లో మంచి నీళ్ళు తాగాక కూడా ఎలా చావకుండా వుంటాడు? విషపు గుళిక గొంతులోకి దిగిపోయి వుండాలి. అలా జరుగలేదు.

కాబట్టి రాబర్ట్ అబద్ధం చెప్పాడని శిరీష్ గ్రహించాడు.

4. తన ప్రత్యర్థులను పట్టించడంలో రాబర్ట్ ప్రదర్శించిన కృతఘ్నతను శిరీష్ గ్రహించాడు. ముందే జాగ్రత్తపడి రాబర్ట్‌ను బంధించ గలిగాడు.



## వీర నిద్ర

నెపోలియన్ గుర్రం మీద స్వారీ చేస్తూ, చిన్న కునుకు తీయగల్గేవాడట. ఐతే, రాత్రిళ్ళు రెండు మూడు గంటలకు పైగా అతనికి నిద్రపట్టేది కాదట, కాని, నెల్సన్ చేతిలో బందీగా చిక్కినప్పుడు మాత్రం కారాగారంలో 36 గంటలపాటు అదేపనిగా ఆదమరచి నిద్రపోయాడట.

జి.వి.జి.

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్